పుస్తకాల ముద్రణకు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయం

తెలుగు యూనివర్సిటీ, మే 1 : తెలంగాణ తెలుగు రచయితలు తమ రచనలను ముద్రించుకోవడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన సృజనాత్మక, పరిశోధనాత్మక, విమర్శనాత్మక రచనలకు ఆర్థిక సహాయం కోసం సంప్రదించవచ్చని వెల్లడించారు. దరఖాస్తును విశ్వవిద్యాలయంలోని విస్తరణ సేవా విభాగం నుంచి, లేదా విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.teluguuniversity.ac.in నుంచి పొందవచ్చని అన్నారు. మార్చి 31వ తేదీలోగా ఇన్‌చార్జి, విస్తరణ సేవా విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పరిపాలనా భవనం, సాయినగర్, బాచుపల్లి ప్రాంగణం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, హైదరాబాద్-500118 చిరునామాకు పంపించాలని కోరారు.

తెలుగు వర్సిటీలో ఫైన్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో శిల్పం, చిత్రలేఖనం శాఖ పక్షాన ఫైన్ ఆర్ట్స్ ప్రక్రియలలో వేసవి సెలవులలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ తెలిపారు. పెయింటింగ్, శిల్పం, ప్రింట్ మేకింగ్ కోర్సులకు సంబంధించిన శిక్షణకు ఆసక్తిగల విద్యార్థులకు 45రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మే 8 నుంచి ప్రారంభించబడే కోర్సు మొత్తానికి కలిపి రూ.6వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, సంబంధిత డీడీని రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరిట చెల్లించాలని వెల్లడించారు. ఈ సర్టిఫికెట్ కోర్సు గురించి పూర్తి వివరాలకు 8309011865, 8309498807 సంప్రదించాలని సూచించారు.

నేటితో ముగియనున్న ఇంటర్ పరీక్ష ఫీజు గడువు

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షా ఫీజు చెల్లించడానికి గురువారంతో గడువు ముగుస్తుందని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి దాసరి ఒడ్డెన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో సప్లిమెంటరీ ఫీజులు చెల్లించాలని కోరారు. ఏదైన కారణం చేత విద్యార్థుల ఫీజులను తీసుకోవడానికి యాజమాన్యాలు నిరాకరిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యాస రచన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

అమీర్‌పేట్, మే 1 : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జూన్ 5న మండలి నిర్దేశించిన అంశాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ నిషేధం, నీటి పొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ అంశాలపై ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు మే 15వ తేదీలోగా తమ దరఖాస్తులను పర్యావరణ పద్య విభాగం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రధాన కార్యాలయం సనత్‌నగర్‌లో అందజేయాలని అధికారులు సూచించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు, సంస్థలకు జూన్ 5న టీఎస్‌ఈసీబీ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వం అవార్డులు అందజేసి సత్కరిస్తుందని తెలిపారు. టీఎస్‌పీసీబీ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యు.జి.ప్రసన్నకుమార్ 98499 08831, సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వర్‌రావు 91773 03127 నంబర్లను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు.

ఐఐసీటీలో.. స్వచ్ఛ్ పక్వాడా

సిటీబ్యూరో, మే 1(నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో మే 1 నుంచి 15వరకు స్వచ్ఛ్ పక్వాడా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లుగా తెలిపారు. బుధవారం ప్రారంభమైన కార్యక్రమాల్లో భాగంగా, ఈ పక్షం రోజుల పాటు రీసెర్చ్ క్యాంపస్ పరిధిలో పరిసరాల పరిశుభ్రత, శ్రమదానం, ర్యాలీలు, ఈ- వేస్ట్, ఘన వ్యర్థాల తొలగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లుగా తెలిపారు.

బుధవారం మధ్యాహ్నం నిర్మాణుష్యంగా మారిన తెలుగుతల్లి ఫ్లైఓవర్, ట్యాంక్‌బండ్ పరిసరాలు

గ్రేటర్ @ 43డిగ్రీలు

రికార్డు స్థాయిలో నమోదైన ఉష్ణోగ్రతలు

పొంచి ఉన్న వడగాల్పుల ముప్పు

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో బుధవారం రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కరోనా తరువాత ఈ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదుకావడం ఇదే తొలిసారి. అయితే కరోనాకు ముందు 2019, 2018, 2015లో పలు మార్లు ఈ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే కరోనా తరువాత గరిష్ఠంగా 42డిగ్రీలు నమోదుకాగా ఈ వేసవిలో మాత్రం పగలు ఉష్ణోగ్రతలు 43డిగ్రీలకు చేరుకోవడం, దీనికి తోడు రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 30డిగ్రీలకు చేరుకోవడం, గాలిలో తేమ 20శాతం కంటే కిందకు పడిపోవడంతో పగలు ఎండ, వడగాల్పులు, రాత్రి ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43.0డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 29.9డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 16శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో గ్రేటర్‌లో వడగాల్పులు వీస్తున్నాయి. దీంతో చాలా మంది వడదెబ్బ బారిన పడుతున్నట్లు తెలుస్తున్నది. అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిదని వాతావరణ, ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రతలు వహించాలని, తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలని, ఎక్కువగా నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రాణం తీసిన వడ దెబ్బ

మియాపూర్ , మే 1: వడ దెబ్బతో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మియాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్నది. మియాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. మియాపూర్‌లోని మీ సేవ సమీపంలో ఉన్న ఫుట్ పాత్‌పై సుమారు 45 ఏండ్ల వయసున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం అందించారు. రెండు రోజులుగా అతడు ఫుట్ పాత్‌పైనే నిద్రిస్తున్నట్లు, ఎండల తీవ్రత కారణంగా వడ దెబ్బతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కాచిగూడలో..

కాచిగూడ, మే 1: వడ దెబ్బతో గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతి చెందింది. కాచిగూడ ఎస్సై డి.సుభాష్ కథనం ప్రకారం.. సుమారు 65 ఏండ్ల వయసున్న ఓ వృద్ధురాలు బుధవారం కాచిగూడ రైల్వేస్టేషన్ పార్కింగ్ ఫుట్‌పాత్‌పై వడ దెబ్బతో మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. మృతురాలి ఒంటిపై నీలి రంగు చీర, వంకాయ రంగు జాకెట్ ఉన్నదని, ఎత్తు 5.0 అడుగులు ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 8712660542లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

టీ హబ్‌తో ఏడు సంస్థలు ఒప్పందం

ముగిసిన డిఫెన్స్, ఏరోస్పేస్ ఇన్నోవేషన్ సమ్మిట్

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఏడు ప్రముఖ సంస్థలు ఒకే వేదికపై టీ హబ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రమైన టీ హబ్‌లో బుధవారం డిఫెన్స్, ఏరోస్పేస్ ఇన్నోవేషన్ సమ్మిట్ కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వ రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అర్మానే, తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ సమక్షంలో ఎస్ఐడీబీఐ, కవచ్, ఐఐఎస్ఎస్ఆర్, బీడీఎల్, కొలిన్స్ ఏరోస్పేస్, కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సంస్థలు టీ హబ్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ రక్షణ, అంతరిక్ష రంగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీ హబ్ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని అన్నారు. దేశంలోనే అత్యంత కీలకమైన ఈ రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ఐటీ శాఖ ఆధ్వర్యంలో స్టార్టప్ కార్యకలాపాలను విస్తృతం చేస్తుందని తెలిపారు. ఆయా రంగాల్లో ఎంతో ప్రతిభావంతులైన నిపుణులు ఉన్నారని, వారి ఆలోచనలకు అనుగుణంగా చేపట్టే ఆవిష్కరణలకు అవసరమైన నిధులను సమకూర్చడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలను టీహబ్ అందిస్తుందని పేర్కొన్నారు. సమ్మిట్‌లో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సుమారు 15 స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని, వారందరి సహకారం కొత్తగా ఆవిష్కరణలు చేసే వారికి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి, సెయింట్ పౌండర్ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి, టీ హబ్ సీఈఓ ఎం.శ్రీనివాసరావు, సిడ్బీ సీజీఎం సత్య ప్రకాశ్ సింగ్, డిఫెన్స్ అడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీ హబ్‌లో జరిగిన డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో కేంద్ర ప్రభుత్వ రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అర్మానే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజ, ఆయా రంగాలకు చెందిన ప్రతినిధులు

దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతమవ్వాలి

బీవీ రాఘవులు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : దోపిడీకి వ్యతిరేకంగా, సంపద పునఃపంపిణీ కోసం పోరాటాలు చేయాలని కార్మికవర్గానికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అధ్యక్షతన మేడే దిన్నోవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ పదేండ్ల కాలంలో మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, ఫెడరలిజాన్ని, సామాజిక న్యాయాన్ని ధ్వంసం చేయడానికి, రాజ్యాంగం మూల సూత్రాలను తూడ్చివేయడానికి కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, నాయకులు జంగా రెడ్డి, ఎంవీ రమణ, జె.బాబూరావు, బి.ప్రసాద్, ఎస్వీ రమ, అరుణజ్యోతి, టి.నాగరాజు, మూర్తి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాత మలక్‌పేట డివిజన్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న అసదుద్దీన్ ఒవైసీ

కొత్త నగరంగా మారుస్తా

ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ

మలక్‌పేట, మే 1: ఆదరించి గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి పరుస్తానని ఎంఐఎం పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పాత మలక్‌పేట డివిజన్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పాత బస్తీ ప్రజలకు ఎంఐఎం రక్షణగా ఉంటుందని, పాత బస్తీని కొత్త నగరానికి ధీటుగా అభివృద్ధి పరిచే బాధ్యత తనదని పేర్కొన్నారు. బీజేపీ ఈసారి అధికారంలోకి వస్తే హైదరాబాద్ పేరును మార్చి భాగ్యనగరంగా మారుస్తామని అంటున్నారని, ఎవడి అబ్బ సొత్తని పేరు మారుస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

15వ రోజుకు చేరిన 'నో ఏసీ క్యాంపెయిన్'

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : కార్మికుల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలంగాణ వాహన సంఘాల నాయకులు చెప్పారు. నగరంలో 'నో ఏసీ క్యాంపెయిన్' 15 రోజులుగా జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ సభ్యులు బుధవారం 'నో ఏసీ క్యాంపెయిన్'లో పాల్గొన్న డ్రైవర్లకు మద్దతు ప్రకటించారు. నగేశ్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

డాక్టర్ కె.నారాయణ

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వాన్ని లోక్‌సభ ఎన్నికల్లో గద్దె దించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సవరించి, కార్పొరేట్, బడా వ్యాపారవేత్తలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. 138వ 'మేడే'ను పురస్కరించుకొని ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సంఘటిత, అసంఘటిత కార్మికులు హైదరాబాద్‌లో బుధవారం భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ.. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారన్నారు. ప్రజలు, కార్మికులు తమ ఆగ్రహాన్ని, నిరసనను ఎన్నికల సమయంలో 'ఓటు' రూపంలో వ్యక్తం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్షం నేత కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు.

ఎంఈడీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మే 1 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్/ఐడీ) మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 16వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

జలమండలిలో ఉద్యోగులు పదవీ విమరణ

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : జలమండలిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఏడుగురు ఉద్యోగులు పదవీ విమరణ పొందారు. క్వాలిటీ సెల్ సీజీఎం భీంరావు, సెంట్రల్ స్టోర్ డివిజన్ జీఎం రఘునందన్ రెడ్డితో పాటు వివిధ స్థాయిలో పనిచేసే మరో ఐదుగురు ఉన్నారు. ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులు, సిబ్బంది వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విమరణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎంలు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, విజయరావు, వినోద్ భార్గవ, టీవీ శ్రీధర్, దశరథ్ రెడ్డి, నాగేందర్ కుమార్, జీఎంతో పాటు ఇతర అధికారులు, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగుతోనే సంపద వృద్ధి

సిటీబ్యూరో, మే 1(నమస్తే తెలంగాణ) : ఆధునిక సాంకేతిక వినియోగంతోనే వ్యవసాయం ద్వారా సంపద వృద్ధి చెందుతుందని నిపుణులు స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఉన్న వ్యవసాయ రంగ నిపుణులు, పరిశోధకులతో నిర్వహించిన ఇక్రిసాట్ గవర్నింగ్ బాడీ సమావేశంలో వెల్లడించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా హైదరాబాద్ వేదికగా గవర్నింగ్ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆహార భద్రత, డ్రై ల్యాండ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి

పంటల సాగును పెంచడమే లక్ష్యంగా ముందుకుసాగాలని వ్యాఖ్యానించారు.

మెంటల్ వెల్‌బీయింగ్‌పై ఉచిత శిక్షణ

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : రామానాయుడు ఫిల్మ్ స్కూల్ ఆధ్వర్యంలో 'మెంటల్ వెల్‌బీయింగ్' కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. ఈ నెల ఆరు వరకు కొనసాగనున్న ఉచిత శిక్షణకు 56 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. వారికి మైండ్ వెల్‌బీయింగ్‌పై నిపుణులతో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాసన్ లింగేశ్వరన్, మిహీక దగ్గుబాటి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిన్నర చిన్నారి కాలేయంలో కణితి

తొలగించి.. బాలిక ప్రాణాలు కాపాడిన నిమ్స్ వైద్యులు

శస్త్రచికిత్స తర్వాత చిన్నారి

ఖైరతాబాద్, మే 1 : నిమ్స్ దవాఖానలో ఏడాదిన్నర చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. డైరెక్టర్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ నగరి బీరప్ప నేతృత్వంలో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి బాలిక ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. నల్గొండ జిల్లా గుర్రంపాడు మండలం కొప్పోలుకు చెందిన బాలవిజయ్, లావన్య దంపతుల కుమార్తె సత్యశ్రీ (ఏడాదిన్నర) గత కొంత కాలంగా తీవ్రమైన అనారోగ్య సమస్యతో బాధపడుతున్నది. తల్లిదండ్రులు పలు ప్రైవేట్ దవాఖానల్లో చూపించగా, హెపటోబ్లాస్టోమా వ్యాధిగా గుర్తించిన వైద్యులు నిమ్స్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. నిమ్స్‌లో వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు 7 X 5 సెంటీమీటర్ల కణితిని గుర్తించారు. అది సగం వరకు కాలేయాన్ని చుట్టేయడంతో శస్త్రచికిత్స అత్యంత క్లిష్టంగా మారింది. డాక్టర్ బీరప్ప నేతృత్వంలోని సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం సవాల్‌గా తీసుకొని వివిధ విభాగాల సమన్వయంతో చికిత్సను ప్రారంభించారు. ముందుగా కణితి సైజును తగ్గించేందుకు మెడికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో నాలుగు దఫాలు కీమో థెరపి చేశారు. అనంతరం శస్త్రచికిత్స నిర్వహించి కాలేయంలోని కణితితో కూడిన కాలేయం కుడి వైపు భాగాన్ని పూర్తిగా తొలగించారు. 24/7 బాలికను పర్యవేక్షించిన వైద్యులు విజయంతంగా చికిత్సను అందించారు. ప్రస్తుతం ఆ బాలిక కోలుకోగా డిశ్చార్జి చేశారు. ఈ శస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీలో పూర్తిగా ఉచితంగా చేయడం విశేషం.

సమావేశంలో మాట్లాడుతున్న విశ్వ మహావిద్యాలయం ప్రతినిధులు

పేద విద్యార్థులకు ఫీజులో రాయితీ

బన్సీలాల్‌పేట్, మే 1 : ఇంటర్మీడియెట్, ఇంజినీరింగ్ చదువుతున్న పేద, ప్రతిభావంతులైన విద్యార్థుల ఫీజులో ప్రత్యేక రాయితీ ఇస్తామని శ్రీ కంచి చంద్రశేఖర సరస్వతి విశ్వమహావిద్యాలయం వైస్ చాన్సలర్ గుళ్ళపల్లి శ్రీనివాస్ అన్నారు. బ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్యస్వామి దేవాలయం హాలులో విద్యార్థులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులోని కాంచీపురంలో ఉన్న మహావిద్యాలయంలో అన్ని వర్గాల వారికి నాణ్యమైన విద్య అందిస్తున్నామని అన్నారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు వసతి, భోజన సదుపాయాలలో ప్రత్యేక రాయితీ ఇస్తున్నామని తెలిపారు. కోర్సు పూర్తి చేసుకున్న 90 శాతం విద్యార్థులకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థల ద్వారా క్యాంపస్ ప్లేస్‌మెంట్ కల్పించామన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ వెంకట్రామనన్, సహాయ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వర రావు, బ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుశీల్ కుమార్, నీలకంఠం, ప్రధాన కార్యదర్శి విజయమూరి సుధాకర్, రఘురామ్ శర్మ, కామరాజ్, నరేంద్ర ప్రణీత్, ప్రసాద్, యమునా పాఠక్, రవికుమార్, ప్రొఫెసర్ మధుసూధనరావు పాల్గొన్నారు.

సమావేశంలో బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న హర్జిత్ సింగ్, సుఖ్‌దేవ్ సింగ్, విశాల్ సింగ్

ప్రపంచ క్రీడగా సిక్కుల యుద్ధ కళ గట్కా

ఖైరతాబాద్, మే 1 : సిక్కుల యుద్ధ కళ గట్కాను క్రీడగా ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని వరల్ గట్కా అసోసియేషన్, నేషనల్ గట్కా అసోసియేషన్ ఆఫ్ ఇండియాయా అధ్యక్షుడు సర్దార్ హర్జిత్ సింగ్ గ్రేవాల్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆ క్రీడకు సంబంధించిన బ్రోచర్లను తెలంగాణ గట్కా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సర్దార్ సుఖ్‌దేవ్ సింగ్ సంతు, సర్దార్ విశాల్ సింగ్, ఉపాధ్యక్షులు గురిందర్ పాల్ సింగ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ క్రీడను ప్రోత్సహించేందుకు తెలంగాణ గట్కా అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి హర్మేశ్ సింగ్ రంజన్, కార్యవర్గ సభ్యులు స్వరణ్ సింగ్, నానక్ సింగ్, తెలంగాణ కోచ్ గుర్విందర్ సింగ్, జస్బీర్ సింగ్, గుర్నామ్ సింగ్, గురుచరణ్ సింగ్, ప్రీతమ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



శతాధిక గ్రంథకర్త డాక్టర్ మలయశ్రీకి డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి, శివారెడ్డి తదితరులు.

తెలంగాణ భాష సంస్కారవంతమైనది

సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి

తెలుగు యూనివర్సిటీ, మే 1 : తెలంగాణ భాష సంస్కారవంతమైనదని సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత డాక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి పేరుతో తెలంగాణ సారస్వత పరిషత్తులో నెలకొల్పిన సాహిత్య పురస్కారాన్ని కరీంనగర్‌కు చెందిన శతాధిక గ్రంథకర్త డాక్టర్ మలయశ్రీకి పరిషత్తు ప్రాంగణంలోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో బుధవారం సాయంత్రం ప్రదానం చేశారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మలయశ్రీకి పురస్కారం కింద 25వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.